ప్రగతి ‘బాట’లో..

- పుట్టపర్తిలో రూ.14 కోట్లతో సిమెంటు రోడ్ల ఏర్పాటు
- ఆధ్యాత్మిక ధామంలో జోరుగా పనులు

పుట్టపర్తి అర్బన్: ఆధ్యాత్మిక ధామంగా పుట్టపర్తి ఎంతో గుర్తింపు పొందినా గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉండేది. అప్పట్లో ఏర్పాటు చేసిన రోడ్లలో గుంతలు పడడం, వర్షం నీళ్లు నిలబడి సత్యసాయి భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడిన సందర్భాలు కోకొల్లలు. 2019 ఎన్నికల సమయంలో పుట్టపర్తి మున్సిపాలిటీలోని ప్రతి వీధి తిరిగిన దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎక్కడ చూసినా ఎగుడుదిగుడు రోడ్లు ఉండడం గమనించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించి ప్రణాళికాబద్ధంగా నిధులు సమకూర్చుకొని సిమెంటు రోడ్లు ఏర్పాటు చేస్తూ ముందుకు సాగుతున్నారు. అధికారం చేపట్టిన నాలుగున్నర ఏళ్లలోనే పదుల సంఖ్యలో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తూ వచ్చారు.

ప్రగతి పరుగులు..

సిమెంటు రోడ్లే కాక పట్టణంలో తారు రోడ్డు, తాగునీళ్లు, విద్యుత్ దీపాలు, డివైడర్ల మధ్య గార్డెనింగ్, అన్నింటి కన్నా ముఖ్యంగా శిల్పారామం కాలనీకి గుర్తింపు తీసుకొచ్చారు. 2012లో అప్పటి ప్రభుత్వం కొండ గుట్టల్లో వందలాది మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. అయితే అవి ఇళ్లు నిర్మించుకోవడానికి అనుకూలంగా లేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నేటికీ కొన్ని చోట్ల పెద్ద బండ రాళ్లతో ఇబ్బంది పడుతున్నారు. తాగడానికి నీళ్లు లేవు, వీధి దీపాలు లేవు. కనీసం సిమెంటు రోడ్డు కూడా అక్కడ కనిపించదు. రెండు సంవత్సరాల కాలంలో శిల్పారామం కాలనీలో వీధి దీపాలు వేయించి ఇంటింటికీ విద్యుత్ సరఫరా అయ్యేలా చేశారు. అక్కడ ఉన్న బోరు నుంచి ప్రతి వీధికీ నీళ్లు వెళ్లేలా ఏర్పాటు చేయించారు. ఇటీవల రూ.కోటితో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు.


శిల్పారామం కాలనీలో ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్డు


మరో కాలనీలో నిర్మించిన సిమెంటు రోడ్డు

పేదల సంతోషమే నా సంతోషం



పేద ప్రజలు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో అడిగిన పనులన్నీ చేసుకుంటూ పోతున్నాం. సీఎం వైఎస్ జగన్ సహకారంతో పట్టణాన్ని బంగారు పుట్టపర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. మున్సిపాలిటీని అప్‌గ్రేడ్ చేయించడం, జిల్లా కేంద్రంగా మార్చి అభివృద్ధికి నిధులు సమకూరుస్తున్నాం. దీంతో పాటు పుట్టపర్తి మీదుగా నాలుగు లైన్ల జాతీయ రహదారి తీసుకురావడంతో అభివృద్ధికి మార్గం సుగమమైంది. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిని రెండు కళ్లలా భావించి తగిన చర్యలు తీసుకుంటున్నా.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే

విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండల పరిధిలోని అటవీ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చెర్లోపల్లి వద్ద విద్యుత సబ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను పలువురు కోరారు. మంగళవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఏవీ రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి, బొంతలపల్లి, అమగొండపాళ్యం, కంబాలపర్తి తదితర గ్రామాల్లో నిత్యం విద్యుత్ లోఓల్టేజీ సమస్య వస్తోందని వెంటనే భూ సేకరణ చేసి సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై ఇది వరకే ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రజలకు వంద శాతం సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. బొంతలపల్లికి వెళ్లే రోడ్డు మధ్యలో సిమెంటు రోడు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు కోతకు గురై ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. 50 మీటర్ల రోడ్డు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. నిడిమామిడిలో విద్యుత్ లైను మార్చమని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులను కోరినా పట్టించుకోలేదని వైస్ ఎంపీపీ రంగన్న పేర్కొన్నారు. అధికారుల అనుమతి లేకుండా ప్రభుత్వం నిర్మించిన బత్తలపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎలా కూల్చివేస్తారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని సీడీపీఓ గాయత్రి తెలిపింది. జిల్లా అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, ప్రత్యేకాధికారి సుభదాస్, వైస్ ఎంపీపీ హనుమంతరెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న ఎంపీపీ ఏవీ రమణారెడ్డి

వ్యాపారుల సంక్షేమమే ధ్యేయం

ధర్మవరం: పట్టుచీరల వ్యాపారుల సంక్షేమమే తమ ధ్యేయమని ధర్మవరం పట్టుచీరల తయారీ వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు గిర్రాజు రవి తెలిపారు. పట్టణంలోని సెమీనారాయణస్వామి ఆలయంలో మంగళవారం పట్టుచీరల వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు గిర్రాజు రవి మాట్లాడుతూ ఐకమత్యంతో ఉంటూ మన సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కొన్ని నెలలుగా పలు నగరాలలో పట్టు వ్యాపారులకు రావాల్సిన దాదాపు రూ.100 కోట్ల బకాయిలను వసూలు చేశామని తెలిపారు. పట్టుసాలె సంఘం, సెమీనారాయణస్వామి ఆలయ కమిటీ సభ్యులు పట్టుచీరల తయారీ, వ్యాపారస్తుల సంఘం సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కలవల రామ్‌కుమార్, పోలా వెంకటనారాయణ, ఉపాధ్యక్షులు పోలా ప్రభాకర్, రంగం ఆది, తవిశిల నాగభూషణం, కార్యదర్శి బెస్త సాంబశివ తదితరులు పాల్గొన్నారు.


కమిటీ సభ్యులను సన్మానించిన పట్టుసాలె సంఘం సభ్యులు

రీసర్వే సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి అర్బన్: జీవితంలో ఎప్పటికీ భూ సమస్యలు రాకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న సమగ్ర భూ సర్వే భూ హక్కు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి, కప్పలబండ, వెంకటగారిపల్లి గ్రామ పొలాల్లో ఆమె రీ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్ఓ ప్రతాప్, సర్వేయర్లు ఉన్నారు.

9 పోలింగ్ కేంద్రాల మార్పు

పుట్టపర్తి నియోజక వర్గంలో 9 పోలింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల మార్పు బుక్కపట్నం ఒకటి, పుట్టపర్తి అర్బన్‌లో రెండు, నల్లమాడలో ఒకటి, ఓడీసీలో ఒకటి కాగా పేర్లు మార్పునకు ఓడీసీలో నాలుగు ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కొండకమర్లలో ఒకే పోలింగ్ కేంద్రంలో 1,500 పైబడి ఓటర్లు ఉండడంతో కొత్తది ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఏఓ జిలాని, సిబ్బంది హరిక్రిష్ణ, రహిమాన్‌లు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ధర్మవరం విద్యార్థులు ఎంపికైనట్లు మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం భాస్కర్, పీడీ పద్మాబాయిలు తెలిపారు. స్థానిక కొత్తపేటలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి, పీడీ ప్రతాప్‌రెడ్డిలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు..

కదిరి అర్బన్: అనంతపురం జిల్లాలోని అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 26న జరిగిన ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో కదిరి విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ,కోచ్‌లు షెక్షావలి, ఓంప్రకాష్, అక్బర్‌అలీ తదితరుల అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు..

పుట్టపర్తి అర్బన్: అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు మోడల్‌స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ అజీమ్‌బాషా పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు హ్యాండ్‌బాల్ అండర్–14 కు ఓంశ్రీ, శిల్పా, ప్రభుచరణ్‌లు, హ్యాండ్‌బాల్ పోటీలకు అండర్–17 విభాగంలో శ్రావణి, ఉదయశ్రీ , నెట్‌బాల్ అండర్–19 విభాగంలో ధరణి, నవ్యశ్రీ, గ్రీష్మలు ఎంపికైనట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా సూర్యనారాయణ



నల్లమాడ: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా శీకివారిపల్లికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, ఒకటో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాళసముద్రం సూర్యనారాయణను ఎంపిక చేసినట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీయస్ కేశవరెడ్డి తెలిపారు. సూర్యనారాయణకు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. రెడ్డిపల్లి సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించిన ఆయన ప్రస్తుతం అదే రెడ్డిపల్లి ప్రాదేశికం నుంచి ఎంపీటీసీగా గెలుపొంది వైస్ ఎంపీపీగా కొనసాగుతున్నారు. బీసీ వర్గానికి చెందిన కాళసముద్రం సూర్యనారాయణ మండలవ్యాప్తంగా బీసీలతో సత్సంబంధాలు కలిగివుండి మృదు స్వభావిగా గుర్తింపు పొందారు. మండల కన్వీనర్‌గా తన నియామకానికి కృషిచేసిన నాయకులు, ఇందుకు సహకరించిన కార్యకర్తలకు సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా ఇప్పటివరకు డి.కుళ్లాయినాయక్ పనిచేశారు. ఆయన స్థానంలో తాజాగా కాళసముద్రం సూర్యనారాయణను పార్టీ ఆదేశాల మేరకు నియమించారు.

ఇక.. ఇబ్బంది లేకుండా ‘ఇంటర్’

- కేజీబీవీలో నూతన భవనం రెడీ
- రూ.1.02 కోట్లతో అత్యాధునికంగా నిర్మాణం



ఇంటర్ కళాశాల నూతన భవనం

తలుపుల: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. పేద విద్యార్థులకు అవకాశాలు పెంచుతోంది. తగిన సౌకర్యాలు, అధునాతన వసతులతో కూడిన భవనాలు నిర్మిస్తోంది. మారు మూల గ్రామాల నిరుపేద, మధ్యతరగతి బాలికలకు చక్కటి విద్య అందించేందుకు మండల కేంద్రంలో కేజీబీవీ రెండేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చింది. ఇంటర్ విద్యకు అవకాశం వచ్చినా, ఉన్న భవనంలోనే విద్యార్థులు సర్దుకుపోవాల్సిన పరిస్థితి. అయితే, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం కొత్త భవనం మంజూరు చేసింది. ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి చొరవతో రూ.1.02 కోట్లు విడుదలయ్యాయి. భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో విద్యార్థుల బాధలు తప్పనున్నాయి. అక్టోబర్‌లో భవన ప్రారంభోత్సవం చేపట్టనున్నట్లు కాంట్రాక్టర్ పురుషోత్తంరెడ్డి తెలియజేశారు.

పెరగనున్న సంఖ్య..

నూతన భవనంలోకి వెళ్తే విద్యార్థుల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం ఉన్న బైపీసీతో పాటు మరిన్ని గ్రూప్‌లు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఫస్ట్ ఇయర్‌లో 23, సెకండ్ ఇయర్‌లో 19 మంది విద్యార్థులు ఉన్నారు. కొత్త భవనం అందుబాటులోకి వస్తే 80 మందికి పైగా విద్యార్థులు సులువుగా విద్యాభ్యాసం చేయనున్నారు.

భవనం బాగుంది



ఇంటర్‌లో విద్యాభ్యాసానికి అసౌకర్యంగా ఉన్నా తప్పని పరిస్థితిలో చదువుకుంటున్నాము. నూతన భవనం అందుబాటులోకి వస్తే బాగా చదివేందుకు అవకాశం కలుగుతుంది. భవనం బాగుంది.

– వైష్ణవి, ఇంటర్ ప్రథమ సంవత్సరం

ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు



నూతన భవనం అందుబాటులోకి వస్తే విద్యార్థులకు చక్కటి విద్య అందుతుంది. విద్యార్థులకు అనువుగా ల్యాబ్, లైబ్రరీ అందుబాటులో ఉంటాయి. ఇబ్బందులను ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తరపున ఆయనకు కృతజ్ఞతలు.

– మోహనమ్మ, కేజీబీవీ ఎస్‌ఓ, తలుపుల

మంచి మార్కులు సాధిస్తాం



కొత్త భవనంలో విద్యాభ్యాసం మరింత బాగా చేయవచ్చు. మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఏర్పడుతుంది. నూతన భవనంతో పాటు అన్ని సబ్జెక్ట్‌లకు లెక్చరర్స్‌ను నియమిస్తే చక్కటి విద్య అందుబాటులోకి వచ్చి, మాలో నైపుణ్యం పెంపొందుతుంది.

– స్పందన, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి


మంత్రి అంజాద్ బాషాతో నాయకులు

పుట్టపర్తి టౌన్: మైనార్టీల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మైనార్టీ సంఘం కార్యదర్శి షామీర్ బాషా కోరారు. మంగళవారం విజయవాడలో మైనార్టీ శాఖ మంత్రి అజాంద్ బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. త్వరలో మసీదుల మరమ్మతులు, సమస్యలకు పరిష్కారం చూపుతామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి షామీర్‌బాషా, మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మండల అగ్రీ అడ్వైజరీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షులు రంగారెడ్డి, మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్ మహేశ్వర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు.

గ్రంథాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్, ఏపీ గ్రంథాలయ చైర్మన్ల ఫోరమ్ అధ్యక్షురాలు ఎల్ఎం ఉమా మోహన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలో పాఠకులకు, విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు తదితర వాటిపై గ్రంథాలయ అధికారి మూడే బొజ్జేనాయక్‌తో ఆరా తీశారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, సిబ్బంది ఖాదర్ బాషా, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

నల్లచెరువు: తనకల్లు మండలం బత్తినవారిపల్లికి చెందిన రఘు అనే వ్యక్తి యర్రగుంటపల్లిలో బంధువులు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి మంగళవారం హాజరయ్యాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి సమీపంలోని ఒక ఇంటి వద్ద నిలిపి ఉన్న తన ద్విచక్ర వాహనం (హోండా ప్యాషన్‌ప్రో)ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని బాధితుడు తెలిపాడు.

క్లుప్తంగా

కదిరి టౌన్ సీఐగా నారాయణరెడ్డి

కదిరి: కదిరి టౌన్ సీఐగా డి.వి.నారాయణరెడ్డిని నియమించారు. ఈ మేరకు మంగళవారం అనంతపురం రేంజ్ డీఐజీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన నంద్యాల జిల్లా కోవెలకుంట్ల నుంచి కదిరికి బదిలీపై వస్తున్నారు. గతంలో పత్తికొండ, అనంతపురం జిల్లా తాడిపత్రి తదితర ప్రాంతాల్లో పని చేశారు. బుధవారం (నేడు) కదిరి టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

రామగిరి: మండల వ్యాప్తంగా జగనన్న లేఔట్లలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఫజుల్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్, పీఆర్ ఇంజినీరింగ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ


విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీపీ

నల్లమాడ: కమ్మవారిపల్లి, ఆర్.రామాపురం ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఆర్.రామాపురం పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నా, ‘జగనన్న కిట్లు’ అందరికీ అందాయా అంటూ విద్యార్థులతో ఎంపీపీ ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అంజినాయక్, శంకర్‌నాయక్, సల్లప్పనాయక్ తదితరులున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


కలశ పూజలు చేసిన దృశ్యం

ముదిగుబ్బ: గాండ్లవారిపల్లి గ్రామంలో టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీతారాముల దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు హోమాలు, గణపతి పూజలు, కలశ పూజలు తదితర వాటిని వేద పండితులు రఘునాథశాస్త్రి బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్వాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ధ్వజ స్తంభన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

రేపు శాంతి ర్యాలీ

కదిరి అర్బన్: మిలాదున్నబీని పురస్కరించుకుని ఈనెల 28న (గురువారం) పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మిలాద్ కమిటీ కార్యదర్శి మక్బుల్ అలీఖాన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు అనిమియా మసీదు నుంచి ప్రారంభమై ఇక్బాల్‌రోడ్, మెయిన్ రోడ్, బైపాస్‌రోడ్ మీదుగా అనీమియా మసీదుకు చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు


మట్కా నిర్వాహకుల వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య

ధర్మవరం అర్బన్: పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న వారిని అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. స్థానిక సెబ్ స్టేషన్‌లో మంగళవారం మట్కా నిర్వాహకుల అరెస్టు చూపించారు. సీఐ మాట్లాడుతూ పట్టణంలోని కదిరిగేటు సమీపంలో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడులు నిర్వహించి మట్కా నిర్వహిస్తున్న రామాంజినేయులు, లింగమయ్య, భద్రాచారిలను అరెస్టు చేసి వారి నుంచి రూ.10,770 నగదు, రెండు సెల్‌ఫోన్లు, 11 మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

ఏపీజీఈఏ సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

కనగానపల్లి (చెన్నేకొత్తపల్లి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల (ఏపీజీఈఏ) సంఘం తాలుకా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మంగళవారం చెన్నేకొత్తపల్లిలో నిర్వహించిన ఈ ఎన్నికలను జిల్లా ఏపీజీఈఏ సంఘం నాయకులు విజయ భాస్కరరెడ్డి, బాబా ఫకృద్దీన్ పర్యవేక్షించారు. 19 మందిని కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు. పాలక కమిటీ ఎన్నికలు నిర్వహించగా, చెన్నేకొత్తపల్లి తాలుకా అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా సుమన్, ఉపాధ్యక్షుడిగా ఉదయ్ కుమార్, వివిధ ప్రభుత్వ శాఖల వారిగా మరో 10 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు

ధర్మవరం: ప్లాస్టిక్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. పట్టణంలో మంగళవారం పలు షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. 15 కేజీల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. రూ.15 వేల జరిమానా విధించారు. శానిటరి ఇన్‌స్పెక్టర్లు మహబూబ్‌బాషా, శ్యామ్సన్, మేస్త్రీలు ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీఓ అంజనప్ప ఆకస్మిక తనిఖీ చేశారు. గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందుతుందా అని ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మజ పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

పుట్టపర్తి టౌన్: అమడుగూరు మండలంలోని కస్సముద్రం, మహమ్మదబాద్ గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ, రెవెన్యూ అధికారులు వేరుశనగ పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. కస్సముద్రంలో 7,650 కేజీలు, మహమ్మదాబాద్‌లో 3 కేజీల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఏఓ వెంకటరమణాచారి తదితరులున్నారు.

ఇంట్లో చోరీ

నల్లచెరువు: మండల పరిధిలోని యర్రగుంట పల్లి గ్రామంలోని తన ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న దాదాపు 3 తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారని బాధితురాలు ఎం.లక్ష్మీదేవి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు.

దిశా యాప్‌పై అవగాహన

గాండ్లపెంట: వేపరాల పంచాతీ చెరువు ముందర తాండా గ్రామాన్ని కదిరి డీఎస్పీ శ్రీలత మంగళవారం సందర్శించారు. గ్రామస్తులతో గ్రామ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. పిల్లలను బాగా చదివించుకుని గొడవలకు పోకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. సమస్యలుంటే అధికారులకు తెలపాలన్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐ మల్లికార్జున రెడ్డి ఉన్నారు.

పాఠశాలలను సందర్శించాలి

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్ కదిరి డివిజన్ పరిధిలోని 12 మండలాలకు సంబంధించి వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వెల్ఫేర్ అసిస్టెంట్ తమ పరిధిలోని పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని చెప్పారు. జీఓ ఎంఎస్ నంబర్ 46లోని అధ్యాయాలను సమగ్రంగా వివరించారు.

రాష్ట్ర యూబీఎస్ యువజన కార్యదర్శిగా శ్రీనివాసులు

రామగిరి: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసులును నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర సలహాదారు మోపూరి ఈశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దకొండాపురానికి చెందిన శ్రీనివాసులును రాష్ట్ర యువజన కార్యదర్శిగా నియమించారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

రామగిరి: గంగంపల్లి సమీపంలో మంగళవారం వేకువజామున కారు బోల్తాపడి నలుగురు గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి నసనకోట ముత్యాలమ్మ దర్శనానికి కుటుంబ సభ్యులు మంగళవారం వేకువజామున కారులో వెళ్తుండగా కారు బోల్తాపడింది.

పారదర్శకంగా ‘ఈ క్రాప్’

తలుపుల: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని మంగళవారం ఏడీఏ సత్యనారాయణ వ్యవసాయ సహాయకులకు సూచించారు. కుర్లి, ఓదులపల్లి గ్రామాల్లో సాగు చేసిన వరి, వేరుశెనగ, కంది పంటల ఈ క్రాప్ బుకింగ్‌ను క్షేత్రస్థాయిలో ఏఓ షాదాబ్‌తో కలిసి, ఏడీఏ పరిశీలించారు.